నమస్తే తెలంగాణ
నల్లగొండ
10 | నల్లగొండ, శనివారం 11 మే 2024 | NALGONDA

నేటితో ప్రచారానికి తెర

ఉమ్మడి జిల్లా అంతటా హోరెత్తిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

- మూడు చోట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోలు
- ప్రచారానికి కేటీఆర్, హరీశ్‌రావు రాక
- ప్రచారంలో అన్నీ తానై వ్యవహరించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలు
- కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు సైతం జిల్లాకు..

నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో ఇన్నిరోజులు హోరెత్తిన ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు అంటే శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగియనుంది. నేడు ప్రచారానికి చివరి రోజు కావడంతో భారీ ర్యాలీలు, సభలతో నియోజకవర్గాలన్నీ సందడిగా మారనున్నాయి. నేటి సాయంత్రం తర్వాత ఆయా పార్టీల అభ్యర్థులంతా ఇక కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించనున్నారు. ఇన్నాళ్లు చేసిన ప్రచారాన్ని ఓట్ల రూపంలో మలుచుకోవడం ఎట్లా అనేదే ఇప్పుడు కీలకం కానుంది. నేడు, రేపు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటింగ్ చేయించుకోవడమే ఏకైక లక్ష్యంగా కానుంది.

– నల్లగొండ ప్రతినిధి, మే10(నమస్తే తెలంగాణ)

గత పొరపాట్లు పునరావృతం కాకుండా..

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడగా గత నెల 18న నోటిఫికేషన్ వెలువడింది. దీని ప్రకారంగా ఈ నెల 13న పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికల షెడ్యూల్ రాగానే అన్ని ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అభ్యర్థుల ఎంపికలోనే ఆచితూచి వ్యవహరిస్తూ బలమైన అభ్యర్థులుగా పరిగణించి రంగంలోకి దింపారు. బీఆర్ఎస్ ఎప్పటిలాగే సామాజిక సమతూకాన్ని పాటిస్తూ భువనగిరిలో బీసీ వర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌ను, నల్లగొండలో సీనియర్ నేత కంచర్ల కృష్ణారెడ్డిని అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. కేసీఆర్ మార్గదర్శనంలో కేటీఆర్ పర్యవేక్షణలో రెండుచోట్లా ప్రచారంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థుల ప్రచారం, రోడ్‌షోల్లో వీలైనన్నీ ఎక్కువ చోట్ల జగదీశ్‌రెడ్డి పాల్గొంటున్నారు. రేవంత్ సర్కార్ వైఫల్యాలు, మోసపూరిత హామీలను ఎండగట్టడంతో పాటు సమైక్య పాలనలో జిల్లా వెనుకబాటుతనానికి కాంగ్రెస్ మంత్రులు, ముఖ్య నేతలే కారణమని ఎత్తి చూపుతూ వేడి పుట్టించారు. అదే సమయంలో కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధి, దాని ఫలాలను మరోసారి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి ప్రాధాన్యతనిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వదంటూ జిల్లా ప్రజలకు పదేపదే విజ్ఞప్తి చేస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు. అక్కడక్కడ కొందరు అధికారయావతో పార్టీని వీడుతున్నా, అసలుసిసలైన క్యాడరంతా పార్టీవెంటే ఉన్నారని, కష్టపడితే వాళ్లకే తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు సైతం..

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నామినేషన్ల సందర్భంగా భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. నకిరేకల్‌లో శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బహిరంగ సభలో పాల్గొని ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. నల్లగొండలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి, భువనగిరిలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారాన్ని భుజస్కంధాలపై వేసుకున్నారు. పట్టణ, మండల కేంద్రాలను టార్గెట్ చేస్తూ అభ్యర్థులతో కలిసి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నల్లగొండలో, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భువనగిరిలో ఆ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచార సభల్లో పాల్గొన్నారు. భువనగిరిలో సీపీఎం అభ్యర్థి జహంగీర్ పోటీలో ఉండగా ఆ పార్టీ అగ్రనేత సీతారాం ఏచూరి ప్రచారంలో పాల్గొన్నారు. వీరితోపాటు ఇతర అభ్యర్థులు సైతం తమ గుర్తులతో ప్రచారం కొనసాగిస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

ప్రచారం చివరి దశకు చేరుకోవడంతో ప్రధాన పార్టీల శ్రేణులు ఓటర్ల తలుపుతట్టుతున్నాయి. ఇంటింటికీ కరపత్రాలు, మోడల్ బ్యాలెట్ పేపర్లను పంచుతూ గుర్తులను చూపిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నాయి. నేటి సాయంత్రం ప్రచారానికి తెరపడనుంది. ఆ తర్వాత ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడంపై దృష్టి సారించనున్నారు.

కేసీఆర్ బస్సుయాత్ర ఇక్కడి నుంచే...

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రను నల్లగొండ లోక్‌సభ పరిధిలోని మిర్యాలగూడ నుంచే శ్రీకారం చుట్టడం విశేషం. గత నెల 24న బస్సుయాత్రగా బయల్దేరి సాయంత్రం 6గంటలకు మిర్యాలగూడ, 8గంటలకు సూర్యాపేట రోడ్‌షోల్లో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మర్నాడు 25వ తేదీ సాయంత్ర 7గంటలకు భువనగిరిలో రోడ్‌షోలో పాల్గొన్నారు. కేసీఆర్ బస్సుయాత్రతో రెండు లోక్‌సభ స్థానాల్లోనూ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. ఇక అప్పటి నుంచి నేటి వరకు విస్తృత ప్రచారంలో మునిగిపోయారు. నోటిఫికేషన్ కంటే ముందే కేటీఆర్, హరీశ్‌రావు స్వయంగా సన్నాహక సమావేశాల్లో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇక ఈ నెల 3న చండూరు, నల్లగొండలో హరీశ్ రావు రోడ్‌షోలో పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరిచందన

నల్లగొండ, మే 10 : నల్లగొండ పార్లమెంట్ స్థానానికి మే 13న పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరి చందన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆమె పార్లమెంట్ ఎన్నికలు, శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు పంపించామని, ఈ నెల 12న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఆయా పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బందితోపాటు ఈవీఎంలు చేరుకుంటాయని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 11న సాయంత్రం తమ ప్రచారాలను నిలిపివేయాలని, ప్రచారాలు నిలిపివేసిన సమయం నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యంపై నియంత్రణ ఉంటుందని అన్నారు. ఇక వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు 69 మంది అభ్యర్థులు దాఖలు చేయగా స్క్రూటినీలో ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించామని ఆమె చెప్పారు. ఈ నెల 13న 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, శని, ఆదివారాలు సెలవు ఉంటుందని తెలిపారు. నల్లగొండ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న రాష్ట్ర గిడ్డంగుల శాఖ గోదాములో జూన్ 5న కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ములుగు రెవెన్యూ అదనపు కలెక్టర్, శాసన మండలి పట్టబద్రుల సహాయ రిటర్నింగ్ అధికారి సీహెచ్ మహేందర్, ఏఆర్ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల డిప్యూటీ రిటర్నింగ్ ఆఫీసర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు.వెంకటేశ్వర్లు, మీడియా డల్ అధికారి, ఇండస్ట్రీస్ జీఎం కోటేశ్వర రావు పాల్గొన్నారు.

హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- రాజగోపాల్ రెడ్డి రాజకీయ బ్రోకర్
- నారాయణపురం రోడ్ షోలో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

సంస్థాన్ నారాయణపురం : అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కూసుకంట్ల ప్రభాకర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యామ మల్లేశ్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు గాలి ముచ్చట్లు చెబుతున్నారని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో పోటీలో ఉన్న 37మందిలో ఒక్క కేసు కూడా లేని వ్యక్తిని తానేనని తెలిపారు. అధికారం కోసం పూటకో పార్టీ మార్చే రాజగోపాల్ రెడ్డి రాజకీయ బ్రోకర్ అని ఎద్దేవా చేశారు. రాజగోపాల్ రెడ్డి మంత్రి అవుతాడని పగటి కలలు కంటున్నాడని, ఆయన జీవితంలో మంత్రి కాలేడని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అంగట్లో పశువులను కొన్నట్లు కొంటున్నారని, కొంత మంది పోయినంత మాత్రనా పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని తెలిపారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి వెంకట్‌నారాయణ గౌడ్, మండల కన్వీనర్ నర్రి నరసింహ, వైస్ ఎంపీపీ రాజునాయక్, ఎంపీటీసీలు దోటి జంగయ్య, గడ్డం పెంటయ్య, ఈసం యాదయ్య, నరేశ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురంలో రోడ్ షోకు హాజరైన జనం



సంస్థాన్ నారాయణపురం రోడ్ షోలో పాల్గొన్న బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి

కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసింది

బీఆర్ఎస్ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

దేవరకొండలో అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం

దేవరకొండ రూరల్(దేవరకొండ), మే10 : ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కలిసి ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయన్నారు. నాటి ప్రభుత్వానికి, నేటి కాంగ్రెస్ సర్కారు పాలనకు ప్రజలు తేడా గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే రాష్ట్రంలోగానీ, పార్లమెంట్‌లోగానీ కొట్లాడి నిధులు తెచ్చుకోవచ్చని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటే అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

దేవరకొండ రోడ్‌షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం

దేవరకొండ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు

కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి : మాజీ ఎమెల్యే రమావత్ రవీంద్రకుమార్

అది చేస్తాం, ఇదిచేస్తాం అని ఏవేవో హామీలతో ప్రజలను కాంగ్రెస్ నాయకులు మోసపుచ్చారని, గద్దెనెక్కిన తర్వాత హామీలన్నీ గాలికి వదిలేశారని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీకి ఓటు వేస్తే ఆగమవుతామని హెచ్చరించారు. ప్రజల పక్షాన పోరాడే కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు విజయసింహారావు, రమేశ్‌నాయక్, బిల్యానాయక్, కిషన్‌నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు టీవీఎన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, గాజుల ఆంజనేయులు, అంజిగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధం

ఐదు నెలల్లో బయటపడ్డ కాంగ్రెస్ మోసాలు

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్
- కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే కరువు : జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి
- త్రిపురారంలో ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

త్రిపురారంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

త్రిపురారం, మే 10 : మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ నెరవేర్చలేని హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఆ పార్టీ మోసాలు బయటపడ్డాయన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి గ్రాఫ్ పడిపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి : మాజీ ఎమ్మెల్యే భగత్

చదువుకున్న వ్యక్తి, రైతు బిడ్డ కంచర్ల కృష్ణారెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి కూడా సాగర్ నీటిని పంటలను ఇవ్వలేక పోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని అభివృద్ధి పనులు చేశామని, ప్రస్తుత సాగర్ ఎమ్మెల్యే అంతా తామే చేశామని మాట్లాడడం సిగ్గు చేటని అన్నారు.

పార్లమెంట్‌లో రైతుల కోసం పోరాడుతా : అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

ఎన్నికల్లో గెలిపిస్తే పార్లమెంట్ రైతుల కోసం పోరాడుతానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. వరికి రూ.3,500, పత్తికి రూ.14వేల మద్దతు ధర వచ్చేలా పార్లమెంట్‌లో కొట్లాడుతానని తెలిపారు. రైతు బంధు ఇవ్వక, రుణ మాఫీ చేయక, సాగు నీరు ఇవ్వక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. దేశంలోనే వరి పండించడంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, నాయకులు కడారి అంజయ్యాదవ్, గుండెబోయిన కోటేశ్‌యాదవ్, కామెర్ల జానయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు దస్తగిరి, రైతుబంధు సమితి మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, జయరాంనాయక్, బైరెడ్డి కవిత, లలిత, శ్యాంసుందర్‌రెడ్డి, మడుపు వెంకటేశ్వర్లు, కలకొండ వెంకటేశ్వర్లు, కొనకంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్సే కరువు తెచ్చింది : జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

సాగునీరు ఇవ్వక, కరెంట్ కోతలతో కాంగ్రెస్ పార్టీ కరువు తెచ్చిందని జడ్పీ చైర్మన్, నాగార్జునసాగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి బండ నరేందర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఇంటికీ మంచినీరు అందిందని, మిషన్ భగీరథ నీళ్లు వెళ్లని గ్రామమంటూ లేదని తెలిపారు. పంటలు ఎండిపోతున్నా మంత్రి పదవుల కోసం ఆరాటపడిన చరిత్ర కాంగ్రెస్ నాయకులదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్రిపురారంలో రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

పుత్ర వాత్సల్యం సరే... జిల్లాకు ఏం చేశారో చెప్పండి

- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్
- బీఆర్ఎస్ హయాంలోనే రూ.75వేల కోట్ల అభివృద్ధి
- ధాన్యం దిగుబడిలో రికార్డ్ సృష్టించింది కేసీఆర్ పాలనలోనే..
- సాగర్‌ను కేఎంఆర్‌బీకి అప్పగించింది మీరు కాదా?
- గోదావరిని కావేరిలో కలిపేందుకు మోదీ కుట్రలు చేస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు
- కాంగ్రెస్ పాలనలో నాలుగు నెలలకే నరకం చూస్తున్న ప్రజలు
- రూ.7,500కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టారు
- కాంగ్రెస్ నేతల ఆగడాలతో సూర్యాపేటలో హడలిపోతున్న వ్యాపార వర్గాలు
- రైస్ మిల్లర్ల దగ్గర వసూళ్లకు పోటీపడుతున్న ఉత్తమ్, కోమటిరెడ్డి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 10 (నమస్తే తెలంగాణ) : 'పుత్ర వాత్సల్యంతో విపక్షంపై విమర్శలు చేస్తున్నారు సరే.. మీరు సుదీర్ఘ కాలం మంత్రిగా పని చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వెలగబెట్టింది ఏంటో వివరించాలి' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డికి సవాల్ విసిరారు. 35 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు మంత్రిగా ఉండి కూడా జిల్లాకు ఆయన చేసింది శూన్యమని చెప్పారు. అటువంటి జానారెడ్డి పుత్ర వాత్సల్యం కొద్ది సూర్యాపేటకు వచ్చి సూర్యాపేటకు జగదీశ్‌రెడ్డి ఏమీ చేయలేదనడం, ఆ ప్రకటనకు కొనసాగింపుగా మరో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు వారి విజ్ఞతను బయట పెట్టినట్లయిందని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేటకు వచ్చిన జానారెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందిస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఆ సారాంశం ఆయన మాటల్లోనే.. '2014కు పూర్వం ఇక్కడి ప్రజలు ఎటువంటి నీళ్లు తాగేదో, సాగు నీరందక సూర్యాపేట, తుంగతుర్తి రైతాంగం ఏ తీరుగా అల్లాడి పోయిందో సుదీర్ఘకాలంగా అధికారంలో ఉన్న మీకు తెలియకపోవచ్చు. కానీ తెలంగాణ ఉద్యమకారుడిగా నాకు బాగా తెలుసు. చాలీచాలని విద్యుత్, అందీఅందని నీటితో ఆత్మక్షోభను ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకున్న చరిత్ర మీకెక్కడిది? చందాల దందాల గురించి మాట్లాడాల్సి వస్తే.. మీరు వచ్చింది వైట్ హౌసో, రెడ్ హౌసో మాకైతే తెలీదు కానీ.. అక్కడి నుంచే కదా చందాల దందాలు సాగేది. అటువంటి ఇంటి నుంచి మీలాంటి వారు సత్యదూరమైన మాటలు మాట్లాడితే ఇక్కడి ప్రజలెవరూ విశ్వసించరు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే 2014కు పూర్వ దుస్థితి ఉత్పన్నం కావడంతో సూర్యాపేటలో వర్తక, వాణిజ్య వర్గాలు హడలెత్తి పోతున్నాయి. చివరికి వైద్యులు కూడా మీ పార్టీ నేతల ఆగడాలతో భయాందోళనలకు గురవుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మీ నోటి నుంచి కూడా అభివృద్ధి మాట రావడం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ గుర్తుకు రాని అభివృద్ధి మాట ఇప్పుడు మీ నోటి నుంచి వచ్చిందంటే అది ముమ్మాటికీ కేసీఆర్ ఘనతగానే భావించాల్సి ఉంటుంది. దశాబ్ద కాలంగా 75వేల కోట్ల రూపాయలతో అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించడం నేను మంత్రిగా సాధించిన విజయమే. ఒకప్పుడు అన్నానికి అవస్థ పడ్డ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరుసగా నాలుగు సంవత్సరాలు 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి రికార్డు సృష్టించింది కూడా బీఆర్ఎస్ ఎలుబడిలోనే. అటువంటి సుభిక్షంగా ఉన్న రాష్ట్రంలో అబద్ధపు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు నాలుగు నెలల వ్యవధిలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటలు ఎండిపోయేలా చేసి 2014కు పూర్వ దుస్థితికి నెట్టి వేరు. బీఆర్ఎస్ పాలనలో అటువంటి పరిస్థితి ఉత్పన్నం అయినప్పుడు సాగర్‌లో 510 అడుగుల్లో నీళ్లున్నా ఎడమ కాల్వ కింది భూములకు నీళ్లు ఇచ్చాం. ఇప్పుడు 515 అడుగుల్లో నీళ్లున్నా పొట్టకు వచ్చిన పంట పొలాలను కాపాడలేక పోయిన ఘనత మీకు, మీ పార్టీకే దక్కింది. 2 వేల ఆసరా పెన్షన్ ఇస్తున్న కేసీఆర్‌ను ప్రజలు పెద్ద కొడుకుగా భావిస్తున్న తరుణంలో 4 వేలు పింఛన్ ఇస్తానంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మాట తప్పిండు. వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందించేందుకు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఉంచిన 75వేల కోట్లను కమీషన్‌లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లకు చెల్లించింది నిజం కాదా? పెట్టుబడి సాయం 10వేల నుంచి 15వేలు చేస్తామన్నారు. రుణమాఫీ లక్ష నుంచి రెండు లక్షలు అన్నారు. 500 బోనస్‌తో 2,500 గిట్టుబాటు ధర అన్నారు. వాటి అమలులో జరుగుతున్న ఉదాసీనతపై జానారెడ్డి వంటి సీనియర్ నేతలు మాట్లాడితే బాగుండేది. కంప్యూటర్లు కొనుక్కోవడానికి విద్యార్థులకు 5 లక్షల కార్డులంటిరి, అక్కడెక్కడో ఉన్న ప్రియాంకాగాంధీ బాధ పడుతున్నది.. ఆమె చెప్పిందంటూ కాలేజీకి పోయే ఆడ పిల్లలకు స్కూటీలంటిరి. నిరుద్యోగులకు భృతి అంటూ ఫోర్ ట్వంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన మీరు అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నిస్తారని యావత్ నల్లగొండ ఎదురు చూసింది. అందుకు భిన్నంగా పుత్ర వాత్సల్యంతో ఇక్కడికి వచ్చిన మీరు ఇటువంటి ఆరోపణలు చేయడంతో మీ మీద ఉన్న గౌరవం ఇప్పుడు పాతాళంలోకి పోయింది. పైగా అధికారంలోకి వచ్చీ ర